# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 26, డిసెంబర్ 2025


# ప్రపంచశాంతికి ఏసుక్రీస్తు బోధనలు తోడ్పతాయి

★ క్రిస్మస్ వేడుకల్లో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

బెల్లంపల్లి, డిసెంబర్ 25, ప్రభాతవార్త



ప్రపంచశాంతికి ఏసుక్రీస్తు బోధనలు తోడ్పతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్బంగా గురువారం బెల్లంపల్లి పట్టణంలోని కల్వరి మినిస్ట్రీస్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై, మంత్రి క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు మంత్రి పాల్గొన్నారు. గత ఏడాది ఎమ్మెల్యేగా గెలిచిన సమయంలో ఇదే చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న తనకు మిగతా 2లో..



# ప్రజల సౌకర్యార్థం రోడ్ల ఏర్పాటుకు చర్యలు

✦ చెన్నూర్ నియోజకవర్గంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి వేగం

✦ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

మందమర్రి, డిసెంబర్ 25, ప్రభాతవార్త

ప్రజల సౌకర్యార్థం చెన్నూరు నియోజకవర్గంలో అంతర్గత రహదారుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని మందమర్రి పట్టణం దీపక్ నగర్ వార్డులో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గంలో ప్రజల సౌకర్యార్థం రహదారులు, అంతర్గత రహదారులు మురుగు కాలువల నిర్మాణం చేపట్టి దాదాపు 70 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా మందమర్రి పట్టణంలోని దీపక్ నగర్ లో 12 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు కొరకు 18 కోట్ల రూపాయలు మంజూరు చేసి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. స్మశాన వాటిక కొరకు మిగతా 2లో..



## ఆదివాసీ గిరిజన గ్రామాల్లో

# భక్తి శ్రద్ధలతో జంగుబాయి దీక్షలు

లింగాపూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త



మండలంలోని జాముల్ధరా, మరుగూడ గ్రామాల్లో ప్రతి ఏటా పుష్య మాసంలో జంగుబాయి దీక్షలు, భక్తి శ్రద్ధలతో జంగుబాయి భక్తులు దీక్షలను స్వీకరించి నియమనిష్టాలతో నెల రోజులు పాటు దిక్షను స్వీకరించి, ఉపవాసం ఉంటూ పూజిస్తారు. ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి. దీక్ష ద్వారా గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొని, ఆయుర్వేద ఆరోగ్యంతో జీవిస్తారని, పాడిపంటలు సమృద్ధిగా పండి, భక్తి భావం పెరుగుతుంది, జంగుబాయిని పూజించే భక్తులకు అష్ట ఐశ్వర్యాలు లభిస్తాయి అని తెలిపారు.

# వాజ్‌పేయి చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

✤ జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :

భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చూపిన బాటలో నడవాలి జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణ బిజెపి కార్యాలయంలో మిగతా 2లో..



# చైనీస్ మాంజ అమ్మకం చేపడితే కఠినచర్యలు

★ జిల్లా ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :



చైనీస్ మాంజా అత్యంత ప్రాణాంతకమని జిల్లా ఎస్పీ నితికా పంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్తున్నప్పుడు ఈ దారం మెడకు, ముఖానికి తగిలితే తీవ్రమైన గాయాలు, రక్తస్రావం జరిగే ప్రమాదం ఉందన్నారు. దారం చాలా సన్నగా ఉండటంతో గాలిలో వేలాడుతున్నట్టు కనిపించదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు పూర్తి ముఖాన్ని కవర్ చేసే విండ్ షీల్డ్ ఉన్న హెల్మెట్ ధరించాలని, పైఓవర్లు, గాలిపటాలు ఎక్కువగా ఎగిరే ప్రాంతాల్లో వేగం తగ్గించాలని సూచించారు. చైనీస్ మాంజా అమ్మకం చట్టరీత్యా నేరమని, పర్యావరణ పరిరక్షణ చట్టం భారతీయ న్యాయ సంహిత కింద భారీ జరిమానాతో పాటు ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. మాంజా అమ్మకం, రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు నేరుగా గాని డయాల్ 100 ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# ప్రజల సౌకర్యార్థం రోడ్ల ఏర్పాటుకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, అంబేద్కర్ భవన్ నిర్మాణం కొరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అమృత్ పథకంలో భాగంగా చెన్నూర్, క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీలలో 100 కోట్ల రూపాయలతో పనులు చేపట్టడం జరిగిందని, ప్రతి ఇంటికి నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు రెండు పడక గదుల ఇండ్లు కేటాయించడం జరిగిందని, అసలైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మొదటి విడతలో ఇండ్లు రానివారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మరో విడతలో అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మందమర్రిలో బస్సు సౌకర్యంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. మందమర్రిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, సిఎస్ఆర్, డిఎంఎఫ్‌టి నిధుల ద్వారా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, అమృత్ పథకం కింద ప్రతి ఇంటికి త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో రహదారులు, మురుగు కాలువలు, సోలార్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వాజ్‌పేయి చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా చిత్రపటానికి దీప ప్రజ్వలన పూలమాలవేసి మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం కోసం అంకితభావంతో పనిచేసిన అటల్ జీ జీవితం, ఆయన ఆదర్శాలు, అచంచలమైన దేశభక్తి ప్రతి ఒక్కరికీ నిరంతర ప్రేరణగా నిలుస్తుందని ఆయన చూపిన బాటలో నడుస్తూ, ప్రజా సేవలో పునరంకితం కావడమే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. దేశ అభివృద్ధి కోసం అటల్ బిహారీ వాజ్పేయి చేసిన సేవలు చారిత్రాత్మకమని, దేశంలో ఎన్నో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత నాయకుడన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి భారతదేశంలో జన్మించి,దేశానికి అంకితభావంతో సేవలందించడం మన భారత ప్రజల అదృష్టమని కొనియాడారు. వాజ్పేయి స్ఫూర్తిని తీసుకొని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలో భారత్ దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు ధోని శ్రీశైలం, అరుణ్ లోయ, హరీష్ పెద్ది, సాయి, కృష్ణ స్వామి, రాజు, గోపి,సాయి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప పల్లకి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

**నేరడిగొండ, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపులో ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు చేసి పల్లకిని ఎత్తుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ భక్తి మార్గంలో నడవాలని, భక్తి మార్గంలో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మహేందర్‌రెడ్డి ఉన్నారు.

## మాజీ ప్రధాని వాజ్‌పేయి అడుగుజాడలో అందరూ నడవాలి

**తాండూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :**



భారతరత్న భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్పేయి అడుగుజాడల్లో అందరు నడవాలని బిజెపి జిల్లా కార్యదర్శి మహిధర్ గౌడ్, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని ఐబిలో వాజ్పేయి గురువారం వాజపేయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాజ్పేయి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధి కోసం అటల్ బిహారీ వాజ్పేయి చేసిన సేవలు చారిత్రాత్మకమని, దేశంలో ఎన్నో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహోన్నత నాయకుడన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి భారతదేశంలో జన్మించి,దేశానికి అంకితభావంతో సేవలందించడం మన భారత ప్రజల అదృష్టమని కొనియాడారు. వాజ్పేయి స్ఫూర్తిని తీసుకొని దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచంలో భారత్ దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, నాయకులు తుకారాం, కేశెట్టి విజయ్ కుమార్, సిద్ధం మల్లేష్, పుట్ట కుమార్, రాచర్ల సురేష్, గాదె రాజేశం, ప్రశాంత్, విగ్నేష్, శంకరయ్య పాల్గొన్నారు.

# ప్రపంచశాంతికి ఏసుక్రీస్తు బోధనలు తోడ్పతాయి

(మొదటిపేజీ తరువాయి)

ఏసుక్రీస్తు ఆశీస్సులతో మంత్రి పదవి లభించిందని మంత్రి తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. సన్మార్గంలో నడుచు కోవాలని ఏసుక్రీస్తు బోధించారని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని మంత్రి సూచించారు. ఐక్యతకు క్రైస్తవులు సూచి అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు జరుపు కునే పండుగ క్రిస్మస్ అని పాస్టర్ ప్రవీణ్ పేర్కొన్నారు. ప్రేమకు, నమ్మకత్వానికి ఏసుక్రీస్తు నాంది అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ ముత్తి నేని రవికుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాద్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కార్యూరి రాంచందర్, రిజన సంక్షేమ శాఖ రాష్ట్ర (ఐటీడీఏ) రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్,మాజీ మున్సిపల్ చైర్మెన్ జక్కుల శ్వేత శ్రీధర్, బుచ్చయ్య పల్లి గ్రామ సర్పంచ్ జాడి మహేష్, కాంగ్రెస్ నాయకులు ముత్తే భూమయ్య, కనక రాజు, దుర్గం గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు... ప్రత్యేక ప్రార్థనలు

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త**

క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. పండుగను పురస్కరించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగజ్‌నగర్ టీచర్స్ కాలనీలోని మద్రే బ్రదరన్ చర్చిలో క్రైస్తవ భక్తులు ఆత్మీయ గీతాలు ఆలపిస్తూ చిన్న పిల్లల నృత్యాలు చేస్తూ ఏసుప్రభుని స్తుతిస్తూ సంతోషంగా ఆరాధించారు. పాస్టర్ యేసు కుమార్ మాట్లాడుతూ దేశ ప్రజలందరూ ఏసుప్రభు దీవెనలతో సుఖసంతోషాలతో ప్రేమ సద్భావాలతో కలిసిమెలిసి జీవించాలని ఆశీర్వదించారు. ఏసుప్రభు పాపుల రక్షకుడుగా 2025 సంవత్సరాలు క్రితం ఈ లోకంలో రక్షకుడిగా జన్మించాడని ప్రపంచమంతా సంతోషంగా ఆయనను కొనియాడుతూ పోషించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్ కూచిపూడి యేసు కుమార్, చునర్కర్ గణేష్,దుర్గం చంద్రకుమార్, పిప్రే దిలీప్ కుమార్, కూచిపూడి జాన్, విక్టర్ పాల్, బోర్లకుంట బుజ్జ, మొల్కర్ దావీద్ తదితరులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న పాస్టర్ యేసు కుమార్

**తాండూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :**

మండలంలోని చర్చిలలో బుధవారం అర్ధరాత్రి క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మాదారం, ఐబి, రేపల్లెవాడ తదితర గ్రామాల్లో గల చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు అందరిని ఆకట్టుకున్నాయి. చర్చిలలో ఫాదర్స్, క్రైస్తవులు ప్రత్యేక ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, ప్రేమ మార్గంలో నడవాలని ఫాదర్స్ బోధనలు చేశారు.



మాదారం చర్చిలో క్రిస్మస్ వేడుకలు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. ఏసును స్మరిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. పాస్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ సిఎస్ఐ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. యువత, చిన్నారులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. ఫాస్టర్లు క్రీస్తు జననం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు.



చిన్నారులకు కేక్ తినిపిస్తున్న పాస్టర్

**చింతలమానేపల్లి, ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఆయా గ్రామలలోనీ చర్చిలలో క్రిస్మస్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. లోకరక్షకుడైన యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చర్చి ఆవరణను రంగురంగుల విద్యుత్ దీపాలతో, నక్షత్రాలతో సుందరంగా అలంకరించారు.బుధవారం అర్ధరాత్రి నుండే చర్చిలో భక్తి వాతావరణం నెలకొంది. చర్చి విచారణగురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యబలి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యేసుక్రీస్తు ప్రేమ, శాంతి, కరుణకు చిహ్నమని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు. లోకానికి శాంతిని ప్రసాదించేందుకు జన్మించిన ప్రభువు దీవెనలు అందరికీ కలగాలని కోరారు.వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రిస్మస్ కెరోల్స్, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఉదయం జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రార్థనల అనంతరం క్రైస్తవులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, భక్తులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

**బెజ్జూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.గోల్కొండ లోని బేతేలు ప్రార్థన మందిరంలో పాస్టర్ అలువాల లజారుస్ క్రీస్తు పుట్టుక,బోధనలను వివరించారు. క్రీస్తు చూపిన శాంతి,సేవభావాలు యావత్ మానవాళికి మార్గదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ తిరుపతి బిఆర్ఎస్ నాయకులు జావిద్ అలీ ఖాన్,పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన సర్పంచ్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

# ఘనంగా వాజ్ పేయి జయంతి వేడుకలు

**సారంగాపూర్, ప్రభాతవార్త:**

అటల్ బిహారీ వాజ్ పేయి 101వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అటల్‌జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాజ్ పేయి దేశానికి చేసిన ఎనలేని సేవలను గుర్తు చేసుకున్నారు. భారత ప్రధానిగా ఉన్నపుడు విప్లవాత్మక నిర్ణయాలతో దేశ భద్రత, అభివృద్ధి విషయంలో తనదైన ముద్ర వేశారన్నారు. ఈయన పుట్టినరోజును సుపరిపాలన దినోత్సవంగా జరుపుకోవాలని బిజెపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మెడిసమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, పట్టణ మండల బీజేపీ నాయకులు రాంశంకర్ రెడ్డి , సాహెబ్ రావ్, గంగారెడ్డి, పద్మాకర్, గిల్లి విజయ్, నరేంద్ర చారి, పుధరి రంజిత్, భరత్, రాము, నారాయణ, ఈర్ల విజయ్, చెన్న రాజేశ్వర్, ప్రకాష్, ధావుజి నాయక్, రమేష్‌తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అటల్‌జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



దీక్షలో పాల్గొన్న జర్నలిస్టులు

## మూడవ రోజుకు చేరిన జర్నలిస్టుల దీక్ష

### పూర్తిస్థాయి మద్దతు పలికిన పలు సంఘాలు..

**నిర్మల్ రూరల్, డిసెంబర్ 25, ప్రభాతవార్త**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటి స్థలాల కోసం జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి మూడవరోజు చేరింది. జర్నలిస్టుల రిలే నిరాహార దీక్షకు పలు సంఘాలు పూర్తిస్థాయి మద్దతును ప్రకటించాయి. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ప్రతినిత్యం నిరంతరం కృషి చేస్తున్న జర్నలిస్టులకు సొంత ఇల్లు లేకపోవడం చాలా బాధాకరమని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రేపు మాపు అని కాలం గడపకుండా వెంటనే ఇంటి స్థలాలను కేటాయించాలని ప్రభుత్వాన్ని జర్నలిస్టుల పక్షాన డిమాండ్ చేశారు. వెంటనే ఇంటి స్థలాలను కేటాయించి జర్నలిస్టులకు అండగా నిలవాలని కోరారు.




సర్పంచ్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

## తాండ్ర సర్పంచ్‌ను సన్మానించిన ముదిరాజ్ నాయకులు

**సారంగాపూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

మండలంలోని తాండ్ర గ్రామానికి నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన కొప్పుల వెన్నెల నరసయ్యలను మండల ముదిరాజ్ అధ్యక్షుడు బొండ్ల రమేష్, నిర్మల్ ముదిరాజ్ జైంట్ యాక్షన్ కమిటీ సభ్యుడు దొంతుల శేఖర్, రవి, రాజు, రమేష్, భీమన్న మర్యాదపూర్వంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ సర్పంచ్‌గా ఎన్నికైనందుకు ఎంతో గర్వపడుతున్నామని తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామ ప్రజల అభిమానాన్ని పొంది ఇంకా ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండ్ర యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిక

**సారంగాపూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

మండలంలోని లింగాపూర్ తండా సర్పంచ్ రాథోడ్ ప్రతాప్, ఉపసర్పంచ్ రాథోడ్ వీరేందర్‌తో పాటు వార్డు మెంబర్‌లు ఆడే అనూష బాయ్, బాబు సింగ్, ఆడే అమిత రమేష్, జాదవ్ రాధిక రవీందర్‌లు గురువారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాభివృద్ధికి అన్నివిధాల కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాంశంకర్ రెడ్డి, నారాయణ, ప్రకాష్, గంగారెడ్డి, సాహెబ్ రావ్, ధావుజి నాయక్, చెన్న రాజేశ్వర్, ఈర్ల విజయ్‌తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## డ్వాక్రా సంఘ భవనం కోసం భూదానం

### - భూమి దానం చేసిన దాసరి అఖిల్ గౌడ్

**బెల్లంపల్లి, డిసెంబర్ 25, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళల సమావేశం మందిరం కోసం నిధులు మంజూరు కావడంతో, భూమి లేకపోవడంతో గ్రామానికి చెందిన దాసరి అఖిల్ గౌడ్ వెళ్లి మహిళా సంఘాలు అడగడంతో వెంటనే మహిళల అభివృద్ధి కోసం భవనం నిర్మాణం కోసం 180 గజాల భూమిని ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజేల్లి రాజకుమారులు డ్వాక్రా సంఘాల మహిళలతో కలిసి భూదాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భూమి దాత మాట్లాడుతూ సహకార సంఘం సంఘం మహిళలు అడగగానే భూమి ఇవ్వడం జరిగిందని, భవనం ఏర్పాటు చేసుకొని వారు దినదిన అభివృద్ధి చెందాలని, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. భూదానానికి ముందుకు వచ్చిన అచల్ గౌడ్ ను గ్రామ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు అందరు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామైక్య సంఘం సభ్యులు, వివో ఏ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన

**జైపూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త**



జైపూర్ మండల కేంద్రంలోని ఎస్.సి కాలనిలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి గురువారం రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ భవన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. నేటి యువత అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ, ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. సబ్బండ వర్గాల లోనిపేద బడుగు బలహీన వర్గాల ప్రజల రక్షణకు రాజ్యాంగములో చోటు కల్పించారని అన్నారు. అంబేద్కర్ నిరుపేద కుటుంబంలో పుట్టి, న్యాయవాదిగా ఆర్థికవేత్తగా, రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమాజంలో తన ప్రత్యేక తను విద్యతో సాధించాడని, ఆయన ఆశయాలను కొనసాగించ డానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అందరూ అంబెడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, డిసిసి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ రెడ్డి, జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్, ఉప సర్పంచ్ శ్రావణ్, నాయకులు అంబాల సంపత్ రెడ్డిలు పాల్గొన్నారు.

## మా గ్రామానికి బస్సు నడపాలి

**సారంగాపూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

మండలంలోని కంకట గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు రోడ్డుపై కూర్చుని ఆందోళనకు దిగారు. నిర్మల్ నుండి గొల్లమాడ వెళ్లే బస్సు తమ ఊరుపైగా వెళ్లాలని తాండ్ర, వైకుంఠాపూర్ మధ్యగల రోడ్డుపై బస్సును అపి బైఠాయించి ఆందోళనకు చేశారు. గ్రామ ప్రజలు ఏ విధంగానైనా నాయకులు, అధికారులకు చెప్పి మా ఊరికి బస్సు వచ్చే విధంగా చూడాలని కోరారు. ఇంత అభివృద్ధి చెందిన కాలంలో కూడా మా ఊరికి బస్సు రాకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని, బస్సు లేక తము చాలా ఇబ్బందులకు గురి అవుతున్నామని ప్రజలు తెలిపారు. గ్రామానికి బస్సు నడపాలని ఆందోళనకు మనీ, మా బాధ అధికారులకు తెలియాలని ఈ ఆందోళన చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



బస్సును ఆపి ధర్నా చేస్తున్న గ్రామస్తులు

## నూతన సర్పంచ్‌కు సన్మానం

**నేరడిగొండ,డిసెంబర్ 25,ప్రభాతవార్త**

మండలంలోని కుమారి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గోదావరి లస్మన్న ని గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఆయన అందించబోయే సేవలు ప్రశంసనీయం అని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధం, త్రాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సర్పంచ్ గోదావరి లస్మన్న ప్రత్యేక దృష్టి సారిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సహకారంతో కుమారి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొని నూతన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన సర్పంచ్‌ను సన్మానించిన గ్రామస్తులు

# క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి





**రామకృష్ణాపూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త**

పట్టణంలోని సీఎస్ఐ చర్చ్‌లో గురువారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో భూగర్భ, గనుల, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి పాల్గొన్నారు. చర్చ్ నిర్వాహకులు వివేక్‌కు సాధర స్వాగతం పలికి, పుష్ప గుచ్ఛం అందజేశారు. క్రైస్తవ మత పెద్దలు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, సీఎస్ఐ చర్చ్ సభ్యులతో కలిసి కేకు కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవత్వం పరిమలిస్తే మత సామరస్యం పెరిగి శాంతి నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలోలో డి.సి.సి అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు గాండ్ల సమ్మయ్య, అబ్దుల్ అజీజ్‌లు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండుగ వేడుకల్లో పాల్గొన్న మాజీ డీసీసీ అధ్యక్షురాలు..

**లక్షెట్టిపేట, డిసెంబర్ 25, ప్రభాతవార్త**

లక్షెట్టీపేట మున్సిపాలిటీ పరిధిలోని మీషన్ కాంపౌండ్, ఉత్కూర్ చౌరస్తా సిఎస్ఐ చర్చిలల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని చిన్నారులతో కేక్ కట్ చేసిన మంచిర్యాల ఎమ్మెల్యే సతీమణి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చర్చి ప్రేస్ బెటర్ ఇంచార్జ్ ఎస్. డేవిడ్ పాల్ మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆ ఏసుక్రీస్తు దేవుడి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండి మంచిర్యాల నియోజకవర్గాన్ని ఇంకా మరెన్నో అభివృద్ధి పనులను చేయాలని ప్రత్యేక ప్రార్థన చేశారు..ఈ సందర్భంగా సురేఖమ్మని చర్చి కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఎండి. ఆరిఫ్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అందరూ కలసిమెలసి ఉండాలి

## - చిన్నారులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ క్రిస్మస్ వేడుకలు

**నేరడిగొండ, డిసెంబర్ 24, ప్రభాతవార్త:**

ఏ మతాల వారైనా అందరూ కలసిమెలసి ఉండాలని, వేరే వారి కష్టాన్ని తన కష్టంగా భావించిన ఏసుప్రభు అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నెరడిగొండ మండల కేంద్రంలోని చర్చ్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను పాస్టర్, ఫాథర్‌లు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో పేరుగాంచిన యేసు ప్రభువారి జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవడం అభినందమియమని, వేరే వారి కష్టాలను తన కష్టాంగ భావించిన గొప్ప వ్యక్తి అని, భారతదేశ ప్రజా స్వామ్యంలో అన్ని కులాలకు సమాన హక్కులు ఉన్నాయని అన్నారు. ఏ మతాలైన వారి సంప్రదాయాలు చేసుకుంటూనే అందరూ కలసిమెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వడూర్ సర్పంచ్ శ్రీకాంత్, మాజీ సర్పంచులు గులాబ్, సుజీల్, లింబాజి, అంబాజి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



సభ్యత్వం తీసుకుంటున్న రైతులు

# వాటాధనం చెల్లించి సభ్యత్వం పొందాలి

**తాండూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తిదారుల సంఘంలో రూ.2వేలు వాటా ధనం చెల్లించి సభ్యత్వం పొందాలని తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాపారాల నిర్వహణ వలన సంఘానికి వచ్చిన లాభాన్ని ఏటా సభ్యులకు వాటాధనం రూపంలో అదనంగా చెల్లించడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా కేంద్రం ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీలకు ఎంపిక చేయబడుతారని తెలిపారు. సభ్యత్వం కోసం రైతు పట్టాదారు పుస్తకం, ఆధార్, పాన్ కార్డు, ఫోటో మొబైల్ నెంబర్ ఇవ్వవలసి ఉంటుందని ఆయన సూచించారు. పూర్తి వివరాల కోసం అర్హులైన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

# యోగ గురువుకు సన్మానం

**తాండూర్, డిసెంబర్ 25 ప్రభాతవార్త :**



మండలంలోని మాదారం టౌన్ షిప్ సింగరేణి కమ్యూనిటీ హాల్లో గురువారం బెల్లంపల్లికి చెందిన యోగ గురువు ఉమారాణిని ఘనంగా సన్మానించారు. యోగ గురువు బోయ ఉమారాణి మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా యోగ నేర్పిస్తూ ఎంతోమందికి తమ శిక్షణ ద్వారా ఆరోగ్యవంతులుగా చేయడం జరిగిందన్నారు. యోగా గురువుగా చేసిన సేవలకు గుర్తింపుకు గాను ఇటీవల మ్యూజిక్ బుక్ ఆఫ్ రికార్డు చైర్మన్ డాక్టర్ సి.పి.యాదవ్ చేతులమీదుగా డాక్టరేట్, డైనమిక్ యోగ అవార్డు రావడం జరిగిందన్నారు. అవార్డు రావడం పట్ల సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, వార్డు సభ్యురాలు గోదాల లక్ష్మి, మహిళలు, పాల్గొన్నారు.

# సర్పంచ్, వార్డు సభ్యురాలికి సన్మానం

**తాండూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :**

మండలంలోని నరసాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మడవి ప్రభాత్ రావ్, మూడో వార్డు సభ్యురాలు ఆత్రం గౌరులను గురువారం సీపీఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శాలువులతో సన్మానించారు. పార్టీ మండల కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టి సర్పంచ్, వార్డు సభ్యులు పంచాయతీ పరిధిలోని గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గుడిమేత బాపురావు, సోయం ప్రభాకర్, కోట్నాక శ్యామ్ రావు, ఆత్రం గంగు, ఆత్రం అనిల్, సోయం గంగు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్ మడవి రావులు ప్రభాత్ రావ్ ను సన్మానించిన సిపిఎం నాయకులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై సౌజన్య, డిసిసి ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి

# క్రీడలు మానసికల్లాసానికి దోహాదం

## - మాదారం ఎస్సై సౌజన్య

**తాండూర్, డిసెంబర్ 25, ప్రభాతవార్త :**

క్రీడలు శారీరధారుఢ్యానికి, మానసికొల్లసానికి దోహదపడతాయని మాదారం ఎస్సై సౌజన్యం అన్నారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో గురువారం అబ్బాపూర్ భీమయ్యక్ దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఎస్సై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన యువత చెడు వ్యసనాలు, అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూక్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని, క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని రాణించాలన్నారు. ఈ పోటీలలో 28 జట్లు పాల్గొనగా, మొదట ఆర్ఆర్ కాలనీ, ఇరుకపల్లి జట్ల మధ్య పోటీ జరిగింది. కార్యక్రమంలో నర్సాపూర్, మాదారం సర్పంచులు మడావి ప్రభాత్ రావ్ కుశ్నపల్లి లక్ష్మీనారాయణ, ఉప సర్పంచులు మడావి పరబత్ రావు, సూరం దామోదర్ రెడ్డి, కాపర్తి సుభాష్, నాయకులు పుట్ట శ్రీనివాస్, భగవంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ కిసాన్ స్లాట్ బుకింగ్ నిబంధనలో మార్పు

## - జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్

**ఆసిఫాబాద్, డిసెంబర్ 25, ప్రభాతవార్త:**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం పత్తి రైతులు తమ పంటను విక్రయించుకునేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ కొరకు అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు స్లాట్ బుకింగ్ పరిమాణం నిబంధనలలో మార్పు చేయడం జరిగిందని, ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి 12 గంటల నుండి బుక్ చేసిన స్లాట్ లకు, రైతులు బుక్ చేసిన పరిమాణానికి అదనంగా 5 క్వింటాళ్ల వరకు మాత్రమే పత్తిని విక్రయించేందుకు అనుమతి ఉంటుందని, దీనికి మించి పత్తి తీసుకోబడదని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి స్లాట్ బుకింగ్ సమయంలో పరిమాణాన్ని సరైన విధంగా నమోదు చేసుకోవాలని తెలిపారు.